సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 20 । ఏప్రిల్ । 2023



సక్రమంగా పరిహారం చెల్లింపు

భూములు కోల్పోయిన రైతులకు సక్రమంగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. 8లో



మైనింగ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

వాలసీ పంచాయతీ నిమ్మలపాడు వద్ద మైనింగ్ తవ్వకాలు చేపట్టేందుకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. 8లో



మన్యంలో ముందస్తు ఖరీఫ్

జిల్లాలోని పాడేరు డివిజన్‌లో వాతావరణం అనుకూలించడంతో గిరి రైతులు ముందస్తుగానే ఖరీఫ్ పనులు ప్రారంభించారు. 8లో



న్యూస్‌రీల్

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

జి.మాడుగుల: స్థానిక గురుకుల పాఠశాలలో 5వ తరగతి ఇంగ్లిష్ మీడియంలో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జె. వేణుప్రసాదరావు తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి సంబంధించి విద్యార్థులు 2022–23లో 4వ తరగతి చదివిన వారై ఉండాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రవేశ పరీక్ష వచ్చే నెల ఏడవ తేదీన జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

సింగంపల్లి ఆశ్రమ విద్యార్థినుల ప్రాజెక్టుకు బహుమతి

రాజవొమ్మంగి: మండలంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టుకు రాష్ట్ర స్థాయిలో బహుమతి లభించింది. ఎస్‌సీఈఆర్‌టీ ఇటీవల విజయవాడలో నిర్వహించిన ఎక్స్‌పోలో విద్యార్థినులు జాహ్నవి, జీవిత, మౌనిక ‘వేస్ట్ వుడ్‌తో వాల్యుబుల్ ఐటమ్స్’ పేరిట ప్రదర్శించిన ప్రాజెక్ట్ బహుమతి పొందినట్టు హెచ్‌ఎం సుబ్రహ్మణ్యేశ్వరి తెలిపారు. ధ్రువపత్రాలు, నగదు బహుమతి, టూల్ కిట్లు అందజేసినట్లు ఆమె పేర్కొన్నారు.

క్రీడా పోటీల్లో గురుకుల పీడీ ప్రతిభ



పతకాలు సాధించిన పీడీ భిక్షం

చింతూరు: సికింద్రాబాద్‌లో ఈనెల 16న హెల్తీ సీనియర్ సిటిజన్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో స్థానిక గురుకుల కళాశాల పీడీ మెండు భిక్షం ప్రతిభ కనబరిచారు. రెండు సిల్వర్ పతకాలు సాధించారు. ఐదు రాష్ట్రాలు పాల్గొన్న ఈ పోటీల్లో 60 ప్లస్ కేటగిరీలో షాట్ పుట్, హేమర్ త్రోలో ఆయనకు పతకాలు దక్కాయి. పతకాలు సాధించిన పీడీని కళాశాల అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



సింగంపల్లి బాలకల ఆశ్రమోన్నత పాఠశాలలో తనిఖీ నిర్వహిస్తున్న డీడీ జాన్‌రాజ్

రాజవొమ్మంగి: మండలంలోని సింగంపల్లి గిరిజనబాలికల ఆశ్రమోన్నత పాఠశాల, జడ్డంగిలోని బాలికల ఆశ్రమ పాఠశాలను గిరిజన సంక్షేమశాఖ డీడీ జాన్‌రాజ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. స్టోరూమ్‌ను తనిఖీ చేశారు. హెచ్‌ఎం. సుబ్రహ్మణ్యేశ్వరి, ఇన్‌చార్జ్ వార్డెన్ రాజ్యలక్ష్మి తదితర ఉపాధ్యాయులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. హెచ్‌ఎం శైలజ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



డెమో నిర్వహిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది

సాక్షి,పాడేరు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పాడేరు జిల్లా ఆస్పత్రిలోని వైద్యబృందాలకు అగ్నిప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. ఆస్పత్రుల్లో ఆకస్మికంగా అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటే అందుబాటులో ఉండే సిలిండర్ల ద్వారా మంటలు ఆపే ప్రయత్నాలను డెమో ద్వారా సమగ్రంగా వివరించారు. పాడేరు అగ్నిమాపక అధికారి కె.పి.నాయుడు, ఎస్‌ఎఫ్‌వో జి.లక్ష్మణరావు, ఎల్.బాలకృష్ణ, సిబ్బంది క్రాంతికుమార్, మోహన్‌బాబు, కొండలరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం పంచేలా..

ఏజెన్సీ అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు ఆహ్లాదం, ఆనందం పంచేలా పర్యాటకశాఖ ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా సీతపల్లి వాగు పక్కనే పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది ప్రారంభానికి సిద్ధం చేసింది. త్వరలోనే పర్యాటకులు, సందర్శకులకు అందుబాటులోకి రానుంది. దీని నిర్వహణ బాధ్యతను త్వరలో డ్వాక్రా మహిళలకు అప్పగించనుంది



చెట్టు కొమ్మను తలపించేలా ఏర్పాటుచేసిన ప్రవేశ ద్వారం



పార్కులో కొమ్ము డ్యాన్సు చేస్తున్న గిరిజనుల ప్రతిమలు

- రూ.1.02 కోట్లతో సీతపల్లి వాగు వద్ద పార్కు నిర్మాణం
- జీవం ఉట్టిపడేలా ఆకృతులు
- సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన పర్యాటకశాఖ
- త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు
- డ్వాక్రా మహిళలకు నిర్వహణ బాధ్యతలు

రంపచోడవరం: పర్యాటకంగా గుర్తింపు పొందిన రంపచోడవరంలో అత్యాధునికంగా రూపుదిద్దిన పార్కు కొద్దిరోజుల్లో అందుబాటులోకి రానుంది. ఇక్కడి సీతపల్లి వాగు పర్యాటకంగా గుర్తింపు పొందింది. దీనికి పక్కనే పర్యాటకశాఖకు చెందిన పార్కు ఉంది. ఇక్కడికి పర్యాటక సీజన్‌లో భారీగా సందర్శకులు తరలివస్తుంటారు. అయితే అందుకు తగ్గట్టుగా ఇక్కడ వసతులు లేకపోవడంతో వారు నిరాశకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో పార్కును అభివృద్ధి చేసేందుకు స్థానిక ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సంకల్పించారు. ఈ మేరకు గతేడాది రూ.1.02 కోట్ల నిధులను రూఅర్బన్ (రూరల్ ఏరియా అర్బన్ డవలప్‌మెంట్) పథకం నుంచి మంజూరు చేయించారు. ఈ నిధులతో చేపట్టిన పనులు దాదాపుగా పూర్తయ్యాయి. రెవెన్యూ డివిజన్ కేంద్రమైన రంపచోడవరానికి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఐ.పోలవరం జంక్షన్‌కు సమీపంలో ఈ పార్కు ఉంది.

ప్రత్యేకతలివే..

- ఊడలతో కూడిన చెట్టును తలపించేలా ప్రవేశ ద్వారం ఆకట్టుకుంటోంది. దీనిని ప్రత్యేకంగా సిమెంటుతోనే నిర్మించారు.
- పార్కులోకి అడుగుపెట్టిన వెంటనే గిరిజనుల సంప్రదాయ నృత్యం కొమ్ము డ్యాన్సు చేస్తున్న గిరిజనుల ప్రతిమలు స్వాగతం పలికేలా ఏర్పాటుచేశారు. వీటిని జీవకళ ఉట్టిపడేలా తీర్చిదిద్దారు.
- పార్కు ఆవరణ మొత్తం కార్పెట్ లాన్ (గడ్డి) పరచడం వల్ల హరితశోభ నెలకొంది.
- పర్యాటకులు విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాటుచేసిన గుడిసెలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.
- పిల్లలు ఆడుకునేందుకు జారుడు బల్లలు, ఆట వస్తువులు అందుబాటులో ఉంచారు.
- పార్క్‌లో కూర్చునేందుకు ఏర్పాటుచేసిన బెంచీలు సిమెంటుతో నిర్మించినప్పటికీ చెక్కతో తయారుచేసిన రూపాన్ని తలపిస్తున్నాయి. పార్కులోనే పర్యాటకులకు అవసరమైనవి అందుబాటులో ఉండేలా షాపులు నిర్మించారు.



పర్యాటకులు కూర్చునేందుకు నిర్మించిన బెంచీ

త్వరలో ప్రారంభానికి చర్యలు

పార్క్ నిర్వహణ బాధ్యతలు డ్వాక్రా మహిళలకు అప్పగించేందుకు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూరజ్ గనోరే నిర్ణయం తీసుకున్నారు. త్వరలో పార్కు ప్రారంభోత్సవం ఉంటుంది. కలెక్టర్, ఐటీడీఏ పీవో, ఎమ్మెల్యే సూచనల మేరకు పార్కు ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తాం. పర్యాటకులకు ఆహ్లాదం పంచడమే కాకుండా ఆకట్టుకునేలా పార్కును తీర్చిదిద్దాం.

– శ్రీనివాసరావు, వెలుగు ఏపీడీ,

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి





విద్యార్థికి పురస్కారం అందజేస్తున్న సాక్షి సంపాదకులు మురళి, ఆకట్టుకున్న విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శన

- సాక్షి సంపాదకులు వర్ధెల్లి మురళి
- శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల్లో ఉత్సాహంగా ‘కేరింతలు 2023’

నక్కపల్లి/ పాయకరావుపేట: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సాక్షి దినపత్రిక సంపాదకులు వర్ధెల్లి మురళి అన్నారు. బుధవారం ఆయన పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో కేరింతలు 2023 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రవైభవం పేరుతో తెలుగు జాతి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే ప్రయత్నంలో భాగంగా శ్రీప్రకాష్ విద్యాసంస్థ కేరింతలు కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలుగు జాతికి సంబంధించి సాహిత్యం, ఆటపాటలు, కళారూపాలు, నడవడిక నియంత్రించే సంప్రదాయాలు, కట్టుబాట్లు ఎన్నో ఉన్నాయని, జానపద కళారూపాలు, నృత్యాలు, భాష, వ్యాకరణం వంటి ఎన్నో అంశాలున్నాయని, ఇవన్నీ తెలుగుజాతి వారసత్వ సంపద అని పేర్కొన్నారు. వీటిని ప్రత్యేక శ్రద్ధ పెట్టి రక్షించుకోవాల్సిన పరిస్థితులు నేడు ఏర్పడ్డాయన్నారు. వైతాళికులు, కవులు, మన సంస్కృతిని నిలబెట్టుకోవాలని ముందుకు వచ్చిన సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. తెలుగు జాతి ఎన్నో రంగాల్లో వెనుకబడి ఉందని, తెలుగుతల్లి కాపాడుకో అంటూ జంధ్యాల పాపయ్యశాస్త్రి రాసిన కావ్యాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. వైతాళికుల పాత్రలను పోషించడానికి ఇటువంటి విద్యాసంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. పిల్లలకు ఫోన్‌లకు బదులు డెస్క్ టాప్‌లు, చెత్త యాప్‌లు లేని ట్యాబ్‌లు ఇవ్వాలన్నారు. చారిత్రక ప్రదేశాల వద్దకు వెళ్లిన సమయంలో కూడా వాటి చరిత్ర తెలుసుకోవడం కంటే ఆండ్రాయిడ్ ఫోన్ మోజులో పడి ఫొటోలో తీసుకోడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఆటపాటలు, బంధువులతో అనుబంధాలు వదిలేస్తున్నారు కాబట్టి పిల్లలను మొబైల్‌ఫోన్‌ల నుంచి దూరంగా ఉంచాలన్నారు. మరో అతిథి డక్కన్ ఫైన్ కెమికల్స్ వైస్‌ప్రెసిడెంట్ ఆనందరావు మాట్లాడుతూ డబ్బుంటేనే ఐశ్వర్యవంతుడు కాదన్నారు. మంచి నడవడిక, ఆరోగ్యం, మంచి బుద్ధులు కలిగిన సంతానం కలిగి ఉన్నవాడే నిజమైన ఐశ్వర్యవంతుడన్నారు. విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయాన్ని కాపాడుకునే ప్రయత్నంలో భాగంగానే తమ విద్యాసంస్థలో ఒకటినుంచి 5వ తరగతి చదువుతున్న సుమారు 800 మంది విద్యార్థులతో ఆంధ్ర వైభవాన్ని చాటిచెప్పే విధంగా తెలుగు జాతి ఔన్నత్యాన్ని సంప్రదాయాన్ని నాటక పద్య, గేయ, నృత్యరూపంలో ప్రదర్శన ద్వారా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం అత్యంత ప్రతిభ కనపరచిన విద్యార్థులకు అతిథులతో పురస్కారాలు అందజేశారు. విద్యాసంస్థల అధినేత సిహెచ్ వికే నర్సింహరావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్‌ప్రకాష్, ప్రిన్సిపాల్ ఎం.వి.ఎస్ మూర్తి ప్రోగ్రాం కన్వీనరు వి.ఎం.ఎస్ రత్నం, కో కన్వీనర్లు ప్రసూనా మౌళి, సంధ్యారాణి, డిఎల్‌పి రాజు, ఉషారాణి, పీఆర్‌వో పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ఆత్మీయ స్వాగతం





సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అరకు ఎంపీ మాధవి

గోపాలపట్నం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా సీఎం జగన్ ప్రత్యేక విమానంలో బుధవారం 9.15గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి హెలికాప్టర్‌లో 9.39 గంటలకు శ్రీకాకుళం జిల్లాకు బయలుదేరారు. అక్కడ పర్యటన ముగించుకుని 2.20 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి ప్రత్యేక విమానంలో 2.34 గంటలకు గన్నవరం బయలుదేరారు. ముఖ్యమంత్రికి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, రాష్ట్ర మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎంపీలు బి.సత్యవతి, జి.మాధవి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, కలెక్టర్ ఎ.మల్లికార్జున, సీపీ సీఎం త్రివిక్రమ్ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్ విశ్వనాథన్, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఐ.పృథ్వీతేజ్ తదితరులు స్వాగతం, వీడ్కోలు పలికారు.

పెరుగుతున్న కోవిడ్ కేసులు

- చింతూరు డివిజన్‌లో అప్రమత్తమైన వైద్యసిబ్బంది
- వైద్యశిబిరాలు ఏర్పాటు
- ఏకలవ్య విద్యార్థులకు సోకిన వైరస్
- ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటున్న వైద్యారోగ్యశాఖ



విద్యార్థికి ర్యాపిడ్ టెస్ట్ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



విద్యార్థినులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

చింతూరు: చింతూరు డివిజన్లో కోవిడ్ కేసులు క్రమేపీ పెరుగుతున్నాయి. గత నెలలో పాజిటివ్ కేసులు స్వల్పంగా నమోదయ్యాయి. ఈ నెలలో ఒక్కసారిగా పెరగడంతో వైద్యసిబ్బంది అప్రమత్తమయ్యారు. డివిజన్లోని తొమ్మిది పీహెచ్‌సీలు, కూనవరం సీహెచ్‌సీ, చింతూరు ఏరియా ఆస్పత్రిలో గతనెల 115 మందికి ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా ఐదుగురికి పాజిటివ్‌గా తేలింది. ఈ నెలలో 382 మందికి పరీక్షలు నిర్వహించగా 125 మందికి పాజిటివ్‌గా తేలింది.

వైద్యసిబ్బంది అప్రమత్తం

కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదైన ప్రాంతాల్లో వైద్యశాఖ సిబ్బంది అప్రమత్తమయ్యారు. వైద్యశిబిరాలు నిర్వహించడంతోపాటు పాజిటివ్‌గా తేలిన వారి కుటుంబ సభ్యులకు టెస్టులు చేపడుతున్నారు. పాజిటివ్ రోగులను హోం ఐసోలేషన్‌లో ఉంచి వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతం పాజిటివ్ కేసులన్నీ ర్యాపిడ్ టెస్టులో నమోదవుతుండగా కచ్చితత్వం కోసం ఆర్‌టీపీసీఆర్ టెస్టులు నిర్వహించేందుకు వైద్య సిబ్బంది సన్నాహాలు చేస్తున్నారు.

పాజిటివ్ కేసులిలా.. : ప్రధానంగా ఈనెలలో తులసిపాక పీహెచ్‌సీలో 47, చింతూరు ఏరియా ఆస్పత్రిలో 35, కూటూరు పీహెచ్‌సీలో 14, లక్ష్మీపురం పీహెచ్‌సీలో 10 కేసులు నమోదయ్యాయి. లక్కవరం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 10 మంది విద్యార్థులకు కరోనా పాజిటివ్‌గా తేలినట్లు తులసిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. పాఠశాలలో జ్వరాలు అధికంగా ఉన్నాయన్న సమాచారంతో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. దీనిలో భాగంగా 200 మంది విద్యార్థులకు కోవిడ్ టెస్టులు నిర్వహించగా 10 మందికి పాజిటివ్‌గా తేలినట్లు ఆయన తెలిపారు. పాజిటివ్ వచ్చిన విద్యార్థులకు మరోమారు పరీక్షలు నిర్వహించడంతో పాటు మాస్కులు ధరించాలని, మందులు, పౌష్టికాహారం తీసుకోవాలని, భౌతిక దూరం పాటించేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించినట్లు వైద్యాధికారి తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులంతా ఆరోగ్యంగానే ఉన్నారని, ఆందోళన చెందాల్సిన పనిలేదని ఆయన తెలిపారు. వైద్యశిబిరంలో సిబ్బంది సరోజిని, ముక్తేశ్వరరావు, జయ, గంగరాజు పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో..

రాజవొమ్మంగి: మండలంలోని మూడు పీహెచ్‌సీల పరిధిలో బుధవారం 11 కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదు అయినట్లు వైద్యాధికారులు వెల్లడించారు. జడ్డంగి పీహెచ్‌సీలో నలుగురికి పరీక్షలు చేయగా, ఇద్దరికి పాజిటివ్‌లు వచ్చినట్లు వైద్యాధికారి సుజి తెలిపారు. రాజవొమ్మంగి పీహెచ్‌సీలో 11 మందికి ర్యాపిడ్ పరీక్షలు చేయడగా 3 పాజిటివ్‌లు నమోదైనట్టు డాక్టర్ లిఖిత తెలిపారు. లాగరాయి పీహెచ్‌సీలో ఎనిమిది మందికి కోవిడ్ పరీక్షలు చేయగా ఆరు పాజిటివ్ నమోదైనట్టు వైద్యాధికారి ఏచూరి రవీంద్ర తెలిపారు.

అప్రమత్తత అవసరం

జలుబు, దగ్గు, జ్వరంతో ఉన్నవారికి ర్యాపిడ్ టెస్టులు నిర్వహిస్తున్నాం. డివిజన్ వ్యాప్తంగా కరోనా కేసులు నమోదవుతున్నా ఆందోళన చెందాల్సిన పనిలేదు. కోవిడ్ నిబంధనల ప్రకారం అందరూ జాగ్రత్తలు పాటించాలి. పాజిటివ్ వచ్చినవారు బయట తిరగకుండా హోం ఐసోలేషన్‌లో ఉంటూ మందులు వాడాలి.

– డాక్టర్ పుల్లయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో, చింతూరు

అనుమతి లేకుండా తవ్వకాలు నేరం

- అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శర్మ
- చుట్టమెట్ట, మంగబందలో తనిఖీలు
- ఇసుక అక్రమ క్వారీల గుర్తింపు
- ఆరు టిప్పర్లు సీజ్



వాహనాలను సీజ్ చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

పెదబయలు: ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక అక్రమ క్వారీలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శర్మ హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని అరడకోట, గలగండ పంచాయతీల పరిధిలో మత్స్యగెడ్డ నుంచి ఇసుక తవ్వకాలు జరిపే ప్రాంతాలను వారు పరిశీలించారు. చుట్టమెట్ట, మంగబంద గ్రామాల సమీపంలో మూడు ఇసుక తవ్వకాలు జరుపుతున్నప్రాంతాలను గుర్తించారు. ఆరు టిప్పర్లను సీజ్ చేసి స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించాలని వారు ఆదేశాలు జారీ చేశారు. ఇసుక ధరలు, ఆదాయ వివరాలను టిప్పర్ డ్రైవర్లు, కూలీల నుంచి తెలుసుకున్నారు.

కలెక్టర్‌కు నివేదిక

మత్స్యగెడ్డలో ఇసుక తవ్వకాలపై కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నట్టు అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు పంచాయతీల పరిధిలో ఇసుక అక్రమ క్వారీలు ఏర్పాటుచేసి తరలిస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ వాహన యజమానుల ప్రోద్బలంతో 24 గంటలు ఈ దందా సాగుతుందన్నారు. అభివృద్ధి పనులు, గృహ నిర్మాణాలకు అవసరమైన ఇసుకు నిమిత్తం కొంత వెసులుబాటు కల్పించామన్నారు. దీనిని ఆసరాగా తీసుకుని కొంతమంది అక్రమ రవాణాకు పాల్పడుతున్నారన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని రాజకీయ పార్టీల నేతలు, జిల్లా మైనింగ్ అధికారులు, రెవెన్యూ, గ్రామసచివాలయం, ప్రైవేట్ వాహనదారులతో సమావేశం ఏర్పాటుచేస్తామని చెప్పారు. ఎస్‌ఐ మనోజ్ కుమార్, ఆర్‌ఐ సింహాచలం, గలగండ సర్పంచ్ పూజారి లోహితాస్ పాల్గొన్నారు.

ప్రత్యేక బృందాలు ఏర్పాటు

అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు వీఆర్వో, వీఆర్‌ఏ ,గ్రామ సచివాలయం సిబ్బందితో ప్రత్యేక బృందం ఏర్పాటుచేయాలని తహసీల్దార్ భాస్కరరావును అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన తహసీల్దార్, వీఆర్వోలపై మండిపడ్డారు. ఇసుక తవ్వకాల నిరోధంపై ఎందుకు దృష్టి సారించలేదని, ఉన్నతాధికారులకు ఎందుకు ఈవిషయం తెలియజేయలేదని ప్రశ్నించారు. ఈ విషయంలో మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదని ఆయన హెచ్చరించారు.

నిర్వాసితుల సమస్యలన్నీ పరిష్కరిస్తాం

- పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్య



సమస్యలు తెలుసుకుంటున్న ప్రవీణ్ ఆదిత్య

దేవీపట్నం: పోలవరం నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. బుధవారం ఆయన ఇందుకూరుపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద కొండమొదలు పంచాయతీ నిర్వాసితులతో సమావేశమయ్యారు. కొండమొదలు, తాళ్లూరు, మెట్టగూడెం గ్రామాలకు చెందిన పలువురు నిర్వాసితులకు సంబంధించి భూమికి భూమి పరిహారం పొందడంలో నెలకొన్న వివాదాలను పరిష్కరించేందుకు ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నెలకొన్న సమస్యలను నిర్వాసితులు అధికారులకు విన్నవించారు. లబ్ధిదారులకు ఆమోదయోగ్యమైన భూములను సేకరించి అందించేందుకు చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర



జాతరకు తరలివచ్చిన జనం



చెక్కు అందజేస్తున్న ఎంపీడీవో సీతయ్య

చింతపల్లి: మండల కేంద్రం చింతపల్లిలో బుధవారం మూడవరోజు ముత్యాలమ్మ జాతర వేడుకలు ఘనంగా జరిగాయి. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాశ విశ్వేశ్వరరాజు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం చింతపల్లిలో రోడ్లన్నీ జాతరకు వచ్చిన వారితో కిక్కిరిసి పోయాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఉత్సవాలకు ఐటీడీఏ నిధులు

చింతపల్లి రూరల్: మండల కేంద్రంలో జరుగుతున్న ముత్యాలమ్మ జాతర నిర్వాహణకు ఐటీడీఏ నిధులు రూ.2 లక్షలు పీవో అభిషేక్ కేటాయించారని ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ఉత్సవ కమిటీకి చెక్కు అందజేశారు. జాతర సందర్భంగా పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్‌కు సంబంధించి ఈ నిధులు కేటాయించినట్లు ఆయన తెలిపారు. జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు దురియా హేమంత్‌కుమార్, వినాయకరావు పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధికి కమిషన్ కృషి



మురళిని అభినందిస్తున్న గిరిజన ప్రజా ప్రతినిధులు

చింతూరు: గిరిజనుల అభివృద్ధికి ఎస్టీ కమిషన్ ఎల్లప్పుడూ కృషి చేస్తోందని ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి అన్నారు. చింతూరులో ఏర్పాటు చేసిన ఎస్టీ కమిషన్ ప్రాంతీయ కార్యాలయాన్ని బుధవారం ఎంపీపీ సవలం అమల, వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గిరిజనుల పోడు భూములకు హక్కులు కల్పించిన ఘనత మహానేత వైఎస్సార్‌తో పాటు వైఎస్ జగన్‌కు దక్కుతుందని ఆయన పేర్కొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా పాలన

8లో

క్లుప్తంగా

ఎంపీని కలిసిన ట్రైకార్ డైరెక్టర్



ఎంపీ మాధవికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సరస్వతి

కొయ్యూరు: ట్రైకార్ డైరెక్టర్‌గా నియమితులైన సుమర్ల సరస్వతి బుధవారం అరకు ఎంపీ మాధవిని కలిశారు.ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.సరస్వతి మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టి సేవ చేస్తామన్నారు. ఎంపీ మాధవి మాట్లాడుతూ బాధ్యతను పూర్తిగా నిర్వహించాలని కోరారు.

సక్రమంగా పరిహారం చెల్లింపు

హుకుంపేట: జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు సక్రమంగా పరిహారం అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. జాతీయ రహదారి 516–ఈ నిర్మాణంపై బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సర్పంచ్‌లు, సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే సక్రమంగా నిర్వహించి వాటి వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. భూములు కోల్పోయిన వారు నష్టపోకుండా చూడాలని సూచించారు. ఇప్పటివరకు 94 శాతం భూసేకరణ జరిగిందన్నారు.మిగతా ఆరు శాతాన్ని త్వరితగతిన సర్వే చేసి పూర్తిచేసి నష్ట పరిహారం చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం గుర్తింపు

వీఆర్‌పురం: సుమారు 60 సంవత్సరాలు పైబడిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు ఏఎస్‌ఐ రాధాకృష్ణ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బూరుగువాడ అటవీ ప్రాంతంలోని ఫారెస్ట్ బేస్ క్యాంప్ పరిధిలో గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం సగభాగం మాత్రమే ఉందని ఏఎస్‌ఐ తెలిపారు. వీఆర్‌ఏ వై.దినేష్ ఫిర్యాదు మేరకు గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా పాలన



పద్మాపురంలో స్థానికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



డొక్రిపుట్టులో గిరిజనులకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

జి.మాడుగుల: పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలో వంజరి సచివాలయం పరిధిలో పద్మాపురం, పెద్దరాయి, చింతలపాడు, గొందిమెలక, బద్దిమెట్ట గ్రామాల్లో బుధవారం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం, మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సంక్షేమ పథకాలపై ప్రజాభిప్రాయాన్ని ఆమె సేకరించారు. సమస్యలను తమ తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ వ్యవస్థల పనితీరుపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి యజమానుల సమ్మతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టికర్లను ఆమె అంటించారు. ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వాన్ని ప్రజల వద్దకు చేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఆయా గ్రామాల్లో 320గడపలను ఆమె సందర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ, ఎంపీటీసీ మధు, సర్పంచ్ రమణి, మండల పార్టీ అధ్యక్షుడు మత్స్యకొండం నాయుడు తదితరలు పాల్గొన్నారు.

మన్యంలో సంక్షేమ స్వర్ణయుగం

ముంచంగిపుట్టు: జగనన్న పాలనలో మన్యం ప్రాంతంలో సంక్షేమ స్వర్ణయుగం నడుస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని దారెల పంచాయతీ తలింభ, డొక్రిపుట్టు, డీంగూడ గ్రామాల్లో రెండవ రోజు బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 148 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు పంపిణీ చేసి ప్రభుత్వం నుంచి పొందిన పథకాలను వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ పథకాలు అందుతున్నాయన్నారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, నేతలు జగబందు, తిరుపతి, జయదేవ్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్

సాక్షి,పాడేరు: జిల్లాలోని రంపచోడవరం,పాడేరు,అరకులోయ నియోజకవర్గాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్ కార్యాక్రమాన్ని పార్టీనేతలు,సచివాలయాల కన్వీనర్లు,గృహసారధులు,ప్రజాప్రతినిధులంతా ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. పాడేరు మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో బుధవారం ఈ కార్యక్రమం విజయవంతమైంది. మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు, ఎంపీటీసీ చిట్టమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు సరస్వతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

- మైనింగ్‌ను స్థానికులకే కేటాయించాలని గిరిజనుల వినతి



ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్



గిరిజనుల వినతితో మైనింగ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులు

అనంతగిరి: మండలంలోని వాలసీ పంచాయతీ నిమ్మలపాడు వద్ద (సర్వే నంబరు 35) 24 హెక్టార్లలో మైనింగ్ తవ్వకాలు చేపట్టేందుకు కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బుధవారం జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. జెడ్పీటీసీ గంగరాజు, సర్పంచ్ సన్యాసిరావు, సమతా డైరెక్టర్ రవి ఆధ్వర్యంలో గిరిజనులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిమ్మలపాడు, రాళ్లగరువు, కరకవలస, తుబుర్తి గ్రామాలకు చెందిన గిరిజనులు మైనింగ్‌ను ప్రైవేట్ వ్యక్తులకు కాకుండా స్థానికులను సొసైటీగా ఏర్పాటుచేసి కేటాయించాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఏపీఎండీసీ జీఎం నతానియేలు మాట్లాడుతూ స్థానికుల అభిప్రాయాలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్తామని పేర్కొన్నారు. మైనింగ్ జరిగితే తప్పనిసరిగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ మాట్లాడుతూ ప్రైవేట్ వ్యక్తులు అయితే తమకు అన్యాయం జరుగుతుందని, స్థానికులతో సొసైటీ ఏర్పాటు చేసి లీజుకు ఇవ్వాలన్న గిరిజనుల అభిప్రాయాన్ని గనుల శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని జీఎంను కోరారు. ఇప్పటివరకు జరిగిన మైనింగ్ తవ్వకాలు నిబంధనలకు అనుగుణంగా జరిగాయా లేదా అనేది పరిశీలించి సమగ్రంగా గనులశాఖ ఉన్నతాధికారులకు నివేదిక అందజేయాలని సూచించారు. అరకు సీఐ రుద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సుదర్శనం, తహసీల్దార్ రాంబాయి, అనంతగిరి, డుంబ్రిగుడ ఎస్‌ఐలు కరక రాము, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో ముందస్తు ఖరీఫ్



హుకుంపేట మండలం మఠం ప్రాంతంలో మెట్టభూముల్లో వేసవి దుక్కిపనులు చేస్తున్న గిరిజన రైతులు

- అనుకూలించిన వాతావరణం
- సాగుకు కలిసి రానున్న వర్షాలు
- సాధారణానికి మించి వర్షపాతం నమోదు
- హుషారుగా వ్యవసాయ పనులు

సాక్షి, పాడేరు: జిల్లాలోని పాడేరు డివిజన్‌లో గిరి రైతులు ముందస్తు గానే ఖరీఫ్ వ్యవసాయ పనులను ప్రారంభించారు. గత 20 రోజుల నుంచి ఏజెన్సీ వ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ వ్యవసాయానికి అనుకూలంగా మారాయి. సాధారణ వర్షపాతం 23.3 ఎంఎం కాగా ఈనెల ఒకటి నుంచి 19వ తేదీ వరకు 37.3 ఎంఎం వర్షపాతం నమోదైందని కలెక్టరేట్‌లోని వాతావరణ విభాగం అధికారులు తెలిపారు. పల్లపు భూముల తోపాటు వాణిజ్య పంటలు సాగు చేసే మెట్ట భూముల్లో వేసవి దుక్కి పనుల్లో గిరి రైతులు నిమగ్నమయ్యారు. పంట భూములకు ఎంతో మేలు జరగడమే కాకుండా భూమి గుల్లగా మారడంతోపాటు లార్వాలు నశిస్తాయని అవగాహన పొందిన గిరి రైతులు కొంతకాలంగా వేసవి దుక్కులకు అలవాటుపడ్డారు. దుక్కి చేసిన భూముల్లో వేరుశనగ, మొక్కజొన్న విత్తనాలు జల్లే పనుల్లో గిరి రైతులు ఉన్నారు. మెట్ట పంటల సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా మారాయి. దీంతో చిరుధాన్య పంటలైన కొర్రలు, సామలు, ఊదలు, కాకిజొన్న సాగుకు గిరిజన రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వచ్చే నెల మొదటి వారం నుంచి నుంచి చిరుధాన్యాల పంటల సాగుకు విత్తనాల జల్లే పనులు ప్రారంభం కానున్నాయి.

పంటల వివరాలు	(హెక్టార్లలో)
ఖరీఫ్ విస్తీర్ణం	: 42,686
వరి	: 5,262
మొక్కజొన్న	: 18,177
రాగులు	: 949
వేరుశనగ	: 6,726

విత్తనాల పంపిణీకి నివేదిక



ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మెట్ట పంటల సాగుకు అనుకూలంగా ఉన్నాయి. వేసవి దుక్కులు చేసిన భూములకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఎంతో మేలు కలుగుతుంది. భూమి గుల్లబారడంతో వర్షం నీరు వృథాకాదు. భూమి సారవంతంగా మారుతుంది. గిరి రైతులకు అవసరమైన వరి, రాగులు, చిరుధాన్యాల విత్తనాల పంపిణీకి ప్రభుత్వానికి నివేదిక పంపాం.

– ఎస్‌బీఎస్ నందు, జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



మ్యాప్‌ను పరిశీలిస్తున్న పీవో అభిషేక్,రెవెన్యూ అధికారులు

అరకులోయ రూరల్: భూ సరిహద్దుల సమస్యలు పరిష్కారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. మండలంలో మాడగడ పంచాయతీ బోడుగూడ గ్రామంలో ఆయన బుధవారం పర్యటించారు. గ్రామంలో ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమి సరిహద్దులు, మ్యాప్‌లను రెవెన్యూ అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోడుగూడ గ్రామ సర్వేనంబర్ 27లో ఉన్న ప్రభుత్వ భూమిని అటవీ శాఖ భూమిలో ఆక్రమణలో ఉన్నట్టుగా గుర్తించామని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా స్థలాలకు సంబంధించి పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ వేణుగోపాల్‌కు ఆదేశించారు. ఎంపీపీ ఉషారాణి, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పీవోకు వినతి

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో పర్యటించిన ఐటీడీఏ పీవో అభిషేక్‌ను బుధవారం పద్మాపురం గార్డెన్, కొత్తవలస, గిరిజన మ్యూజియం చింతపల్లి ప్రాంతాల్లో పనిచేస్తున్న హెచ్‌ఎన్‌టీసీ కార్మికులు కలిసి పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. బకాయి వేతనాలు చెల్లించాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. దీనిపై పీవో సానుకూలంగా స్పందించారు. సీఐటీయూ నాయకులు బాలదేవ్, కార్మికులు పండు, సీతారాం, భగత్‌రాం తదితరులున్నారు.

కీటక జనిత వ్యాధుల నివారణే లక్ష్యం



మాట్లాడుతున్న జమాల్‌బాషా

- డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

సాక్షి,పాడేరు: జిల్లాలో ఎపిడిమిక్ సీజన్‌లో కీటకజనిత వ్యాధుల నివారణే లక్ష్యంగా వైద్యబృందాలు పనిచేయాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా ఆదేశించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు ఐటీడీఏ సమావేశమందిరంలో వైద్యబృందాలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా తదితర వ్యాధుల నుంచి ప్రజలను రక్షించేందుకు వైద్య బృందాలు సైనికుల మాదిరిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని 1403 గ్రామాల్లో దోమల నివారణమందు పిచికారీ పనులు విజయవంతం చేయాలని సూచించారు. రెండు రోజుల ముందుగానే ఆయా గ్రామాల్లో దండోరా వేయించాలని సూచించారు. ఆశావర్కర్లు, వలంటీర్లు తమ గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేసి, దోమల మందు పిచికారిపై ప్రజలను చైతన్యపరచాలన్నారు. పిచికారి పనులు గ్రామాల్లో సక్రమంగా జరగకుంటే పీహెచ్‌సీ వైద్యాధికారి, సబ్‌యూనిట్ అధికారి, హెల్త్ అసిస్టెంట్, ఆశా కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గ్రామవలంటీర్ల సహకారం అందని పక్షంలో తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. ప్రతీ శుక్రవారం చేపట్టే డ్రైడే ఫ్రైడేను విజయవంతం చేయాలని కోరారు. మలేరియా,డెంగ్యూ కేసులు నమోదైన గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. పిచికారి పనుల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులను నియమిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీ కంట్రోల్ జిల్లా అధికారి డాక్టర్ తమర్బ విశ్వేశ్వరనాయుడు, పలు విభాగాల అధికారులు శేషయ్య, దొర, ధనుంజయ్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ మృతి



వెంకటలక్ష్మి మృతదేహం

వీఆర్ పురం: ఫిట్స్ కోసం తీసుకునే టాబ్‌లెట్ మోతాదు అధికమైన ఆశ వర్కర్ అపస్మారక స్థితికి చేరుకొని మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధి పెదమట్టపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ ఏ.రాధాకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పెదమట్టపల్లి గ్రామంలో ఆశ వర్కర్‌గా పనిచేస్తున్న ఎస్.వెంకటలక్ష్మి (38) ఫిట్స్ తదితర వాటి కోసం టాబ్లెట్లు వాడుతుంది. కాగా ఆమె మంగళవారం రాత్రి మోతాదుకు మించి టాబ్‌లెట్లు వేసుకుంది. దీంతో ఆమె అపస్మారక స్థితికి చేరుకొని మృతి చెందిందని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఏఎస్సై రాధాకృష్ణ తెలిపారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

- 2 సెల్‌ఫోన్లు స్వాధీనం

మాడుగుల రూరల్: ఏజెన్సీ ప్రాంతం నుంచి మైదానం ప్రాంతానికి అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను, అరెస్టు చేసి రిమాండుకు పంపించినట్టు స్థానిక ఎస్‌ఐ పి. దామోదర్‌నాయుడు తెలిపారు. బుధవారం పోలీసు సిబ్బందితో కలిసి తాటిపర్తి చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక, మైసూరి జిల్లాకు చెందిన ఎం. శ్రీనివాస్(55), జి.మాడుగుల మండలం రాచపుట్టుకు చెందిన కోర్రా రాజారావు(42) నుంచి 5 కిలోలు గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, ఎండీపీఎస్ చట్టం కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ దామోదర్‌నాయుడు తెలిపారు.

అనారోగ్యంతో శిశువు మృతి



మృతి చెందిన బాబు

జి.మాడుగుల: మండలంలో జి.మాడుగుల పంచాయతీ సాడేకు గ్రామానికి చెందిన బొరుజోజి బంగారుదొర, చిలకమ్మ దంపతుల 5నెలల బాబు అనారోగ్యంతో(శ్వాస సంబంధించిన వ్యాధి)తో మంగళవారం రాత్రి మృతి చెందాడు. శిశువుకు స్థానిక పీహెచ్‌సీలో వైద్య సేవలు అందించి ఇంటికి తీసుకొచ్చామని, రాత్రి శ్వాస ఆడక మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. మృతి చెందిన బాబు తండ్రి బంగారుదొర ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు.

సెల్‌ఫోన్ కోసం వివాదం

- విద్యార్థి కంటికి గాయం



కంటికి గాయమైన విద్యార్థి విజయ్‌బాబు

నర్సీపట్నం : నర్సీపట్నం రామారావుపేట బీసీ కళాశాల వసతి గృహంలో డిగ్రీ, పాలిటెక్నిక్ ఇద్దరు విద్యార్థుల మధ్య సెల్‌ఫోన్ వివాదం చోటు చేసుకుంది. వసతిగృహం విద్యార్థుల కథనం ప్రకారం.. ఎస్.రాయవరంకు చెందిన విజయ్‌బాబు వసతిగృహంలో ఉంటూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. గాజువాకకు చెందిన వెంకటసాయి వసతిగృహంలో ఉంటూ పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇద్దరు వేర్వేరు రూమ్స్‌లో ఉంటున్నారు. సాయి సెల్‌ఫోన్ పోవడంతో విజయ్‌బాబుపై అనుమానం వ్యక్తం చేశాడు. విషయం వార్డెన్ శ్రీనివాస్‌కు తెలియడంతో ఎవరైనా సెల్‌ఫోన్ తీసి ఉంటే ఇచ్చేయాలని చెప్పిన, రెండు రోజుల తర్వాత ఎవరో సాయి ఉంటున్న రూమ్‌లో సెల్‌ఫోన్ పెట్టేశారు. ఫోన్ దొరకడంతో విజయ్‌బాబు నన్ను ఎందుకు అనుమానించావని సాయిని ప్రశ్నించాడు. దీంతో ఇద్దరు విద్యార్థుల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ వివాదంలో విజయ్‌బాబు కంటికి గాయమైంది. విషయం తెలుసుకున్న వార్డెన్, సిబ్బంది విజయ్‌బాబును ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఆస్పత్రి వైద్యుల సూచన మేరకు విద్యార్థి విజయ్‌బాబును ఏబీసీడబ్ల్యూవో ఛాముండేశ్వరరావు, వార్డెన్ విశాఖలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించారు. ఈ విషయమై ఏబీసీడబ్ల్యూవోను సంప్రదించగా విద్యార్థి కంటికి ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపినట్టు పేర్కొన్నారు.

ఆటో బోల్తా.. యువకుడి మృతి

- జాతరకు వెళ్లి వస్తుండగా ప్రమాదం



శివకేశవరావు మృతదేహం

చింతపల్లి: ముత్యాలమ్మ జాతరను తిలకించడానికి వచ్చిన యువకుడు ఆటో బోల్తాపడి ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ నల్లబిల్లి గ్రామానికి చెందిన గొల్లోరి శివశంకరరావు(15) స్నేహితులతో కలిసి చింతపల్లిలో జరుగుతున్న ముత్యాలమ్మ జాతరను తిలకించేందుకు ఆటోలో మంగళవారం రాత్రి చుంచుపడి గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చాడు. అక్కడే ఆటో ఉంచి జాతరను స్నేహితులతో కలిసి తిలకించాడు. బుధవారం ఉదయం అక్కడినుంచి తిరిగి వస్తుండగా ఆటో అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శివశంకరరావును చింతపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతని తల్లిదండ్రులు చిన్నప్పుడే మృతి చెందడంతో అమ్మమ్మ దగ్గర ఉంటున్నాడు. ఏడవ తరగతి వరకు చదువుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.